# బ్యాంబో క్లస్టర్ ను పరిశీలించిన
# ఇండస్ట్రీ ఫౌండేషన్ బృందం



2లో...

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | 3 | డిసెంబర్ | 2024 ◆ పేజీలు : 7





# మంత్రి పొంగులేటి విస్తృత పర్యటన

**అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన రెవెన్యూ శాఖ మంత్రి**

**ఎమ్మెల్యే కోరం సతీమణిని పరామర్శించిన మంత్రి**

**టేకులపల్లి, డిసెంబర్02,ప్రజాజ్యోతి:** టేకులపల్లిమండలం లో రాష్ట్ర రెవిన్యూ,హౌసింగ్,సమాచారం మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య,జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్,ఐటీడీఏ పీవో రాహుల్ తో కలసి విస్తృతంగా పర్యటించారు.ఈ పర్యటనలో భాగంగా మొత్తం 15.38కోట్ల అంచనా వ్యయంతో చేపట్టానున్న పలు బిటీ రోడ్ల పనులకు శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు.మొదటగా సింగ్యతండా నుండి గొల్లగూడెం వెళ్ళు 2.2 కిలోమీటర్ల రహదారి, ఎర్రాయిగూడెం గ్రామం నుండి చింతలకట్ట గ్రామం వరకు రహదారి,ఎర్రబోడు నుండి దాసుతండా వరకు 3.8కి.మీ రహదారి పనులకు, ఓడ్డుగూడెం పంచాయతీ రోడ్డు నుండి జంగాలపల్లి వయా బర్లగూడెం వరకు నాలుగు కిలోమీటర్ల రహదారి,పెద్ద చర్లపల్లి గ్రామం వరకు గంగారం నుండి ఉలవచేలక గ్రామం వరకు నిర్మించనున్న ఎస్ టి ఎస్ టి ఎఫ్ నిధులు 15.38 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పోగులేటి మాట్లాడుతూ శంకుస్థాపన చేసిన రోడ్లను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. కాంట్రాక్టర్లు రోడ్డు నిర్మాణ పనులలో నాణ్యత పాటించాలన్నారు.రానున్న పది రోజుల్లో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కార్యక్రమం చేపడతామన్నారు.అర్హులైన పేదవారి అందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు.దీనిలో భాగంగా మొదటి విడతగా స్థలం ఉండి ఇంటి నిర్మాణానికి ఆర్థిక స్తోమత లేని పేదవారికి ఇంటి నిర్మాణం కోసం 5 లక్షల రూపాయలు మంజూరు చేస్తామన్నారు.గంగారం గ్రామంలో వున్న ప్రభుత్వ గిరిజన బాలుర వసతి గృహాన్నిమంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ తనిఖీలో భాగంగా మంత్రి వసతి గృహంలో వంటశాలను పరిశీలించి విద్యార్థులకు

మిగతా 2లో...

## మంత్రి పొంగులేటిని కలిసిన సాంబమూర్తి దంపతులు

**ఇల్లందు, డిసెంబర్ 2, ప్రజాజ్యోతి:** ఇల్లందు నియోజకవర్గంలోని టేకులపల్లి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన, ప్రారంభోత్సవాలకు సోమవారం వచ్చిన రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని సీనియర్ కాంగ్రెస్ నాయకులు మడుగు సాంబమూర్తి –వెంకటలక్ష్మి దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజాపాలన ఏడాది పూర్తి అయినందున జరిగే కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని కోరినట్లు సాంబమూర్తి తెలిపారు.



# రైతుకు వెన్నుదన్నుగా వ్యవ "సాయం"

**ప్రభుత్వ విధానాలతో ప్రతి పంటకు పెరిగిన ధర**

**"వరి" నుంచి "పామాయిల్" వరకు అన్నింట అభివృద్దే**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారం**

**వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల ముందు చూపే రైతు ఆర్థిక అభివృద్ధికి కారణమైంది..**

**రైతు సంఘం నాయకులు ఆలపాటి రామచంద్ర ప్రసాద్, బండి భాస్కర్, మొగళ్ళపు చెన్న కేశవరావు**



2లో...

## కార్మిక హక్కులపై పోరాడేది .. ఐఎన్ టియుసి



*కొత్తగూడెం మునిసిపాలిటీ /డిసెంబర్2(ప్రజాజ్యోతి ):*

కార్మిక హక్కులను సాధించుటకై ఎల్లప్పుడూ పోరాడేది ఐఎన్ టియుసి అని ఏరియా వైస్ ప్రెసిడింట్ రజాక్ అన్నారు. సోమవారం స్థానిక పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లోని ఐ ఎన్.టి.యు.సి కార్యాలయంలో ఆ సంఘం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్ సూచన మేరకు ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎం.డి రజాక్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సెంట్రల్ కమిటీ మెంబర్స్, బ్రాంచి కమిటీ మెంబర్స్, ఫిట్ కార్యదర్శిలు హాజరయ్యారు.ఈ సందర్భంగా రజాక్ మాట్లాడుతూ ఇటివల జరిగినటువంటి స్ట్రక్చర్ మీటింగ్లో ఏఐటియుసి నాయకత్వం కార్మికుల పక్షాన ఒక్క సమస్యను కూడా సాధించలేకపోయిందని అన్నారు. ఐ ఎన్ టి యు సి యూనియన్ సంబంధించి మన సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ముఖ్యమంత్రి , మంత్రుల దృష్టికి తీసుకెళ్లి కార్మిక హక్కులు సాధించడానికి, విశేషమైన కృషి చేస్తున్నారని తెలిపారు. కార్మికులకు ఏ సమస్య వచ్చినా ఐ ఎన్ టియుసి నాయకత్వం ముందుంటుందని, పిట్, బ్రాంచ్ సెంట్రల్ కమిటీలు చొరవతో పని చేస్తూ కార్మికులకు అందుబాటులో ఉంటున్నందుకు అభినందన తెలియజేస్తూనే, రాబోయేకాలంలో కూడా ఇదే ఉత్సాహాన్నికనపరచాలని, కాంగ్రెస్ పార్టీని ఐఎన్టియుసిని ప్రగతి పదంలో ఉంచడానికి కృషిచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ మెంబర్ నాయకులు బూటిక రాజేశ్వరరావు, జిదుల రాజేశ్వరరావు, సకినాల సమ్మయ్య, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్కే గౌస్, బ్రాంచ్ ట్రెజరర్ భీముడు ,బ్రాంచ్ కార్యదర్శి సైమన్ ,ఏం అశోక్ , బాలు, పోచం శ్రీను విప్లవ రెడ్డి, కాసర్ల సమ్మయ్య , మురళి, వెంకటస్వామి, హిట్ సెక్రటరీలు చిలక రాజయ్య, గోపి కుమార్, సిహెచ్ కుమార్ స్వామి , నటరాజ్ , శంకర్ బాబు, సత్తార్ భాష, భరత్, నాగమోహన్, భాను కమల్ , నాగేశ్వరరావు , రమాకాంత్, శ్రీనివాస్, అర్జున్, అఫ్జల్ , దేవేందర్ రాయమల్లు, ఉద్యోగులు, సానుభూతిపరులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం టూ టౌన్ పోలీస్ స్టేషన్ ని తనిఖీ చేసిన డిఎస్ పి అబ్దుల్ రెహమాన్




*కొత్తగూడెం మునిసిపాలిటీ / డిసెంబర్ 2 ( ప్రజాజ్యోతి ):*

పట్టణంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌ను కొత్తగూడెం సబ్ డివిజనల్ పోలీస్ అధికారి అబ్దుల్ రెహమాన్ తనిఖీ చేసి, పోలీస్ స్టేషన్ రికార్డ్స్ , ఇన్వెస్టిగేషన్ కేసుల పురోగతిని సమీక్షించారు. అదేవిధంగా పోలీస్ స్టేషన్ నిర్వహణ సిబ్బంది పనితీరుని పరీక్షించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి పోలీస్ స్టేషన్ ని ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచుతూ పోలీస్ స్టేషన్ కి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ బాధితులకి తగు న్యాయం జరిగే విధంగా చట్ట ప్రకారంగా వ్యవహరించాలని సిబ్బంది అందరికీ తగు సూచనలు అందజేశారు. అదే విధంగా ఇన్వెస్టిగేషన్లో టెక్నాలజీని వాడుతూ నేరస్తులకు శిక్షపడే విధంగా పూర్తి చేయాలని చెప్పారు. అదేవిధంగా సిబ్బంది పరేడ్, వారి కిట్ ఇన్స్పెక్షన్ కూడా చేశారు. అదేవిధంగా సీసీ కెమెరాలు ఏర్పాటు, నేరాల నియంత్రణ, పోలీస్ పెట్రోలింగ్, డయల్ 100 రెస్పాన్స్, మహిళలపై జరిగే నేరాల నియంత్రణ, రోడ్డు యాక్సిడెంట్స్ జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకునుటకు, గంజాయి నియంత్రణ గురించి ప్రత్యేకమైన శ్రద్ధ చూపమని ఎస్.హెచ్.ఓ కు తగు సూచనలు చేయడం జరిగింది.

# మంత్రి పొంగులేటి విస్తృత పర్యటన





(మొదటి పేజీ తరువాయి... )

నాణ్యమైన భోజనం కల్పిస్తున్నారా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని హెడ్ మాస్టర్ ను ఆదేశించారు.వసతి గృహంలో పరిశుభ్రత పాటించాలన్నారు.విద్యార్థులకు బెడ్లు ఉన్నాయా, వారికి చదువుకోవడానికి అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వివిధ సమస్యల పరిష్కారానికై ప్రజలు తెచ్చిన దరఖాస్తులను మంత్రి స్వీకరించి దరఖాస్తుల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా టేకులపల్లి తాసిల్దారు భవాని ని ఆదేశించారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య సతీమణిని వారి స్వగృహం నందు కలిసి పరామర్శించారు కోరం లక్షి కి ధైర్యం చెప్పారు. సంపత్ నగర్ లోని అనారోగ్యం బారినపడిన నిరుపేద కుటుంబలకు చెందిన వ్యక్తులకు కుంపటి బాల రాజు, జోగ చంద్రశేఖర్, గుర్రం రాములు ఆర్థిక సాయం చేసిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆర్థిక సాయం చేసి అయన మమకారం,దయా గుణాన్ని చాటుకున్నారు.చెందిన ఈ పర్యటనలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, కొత్తగూడెం ఆర్డీవో మధు, ఆర్ అండ్ బి ఈ ఈ వెంకటేశ్వర్లు,జిల్లా వైద్య శాఖ అధికారి భాస్కర్ నాయక్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి లెనినా, మిషన్ భగీరథ ఈ ఈ తిరుమలేష్, నళిని, ఎమ్మార్వో నాగోభవాని, ఎంపీడీవో రవీందర్రావు, ఎంపీ ఓ గణేష్ గాంధీ, ఏపీవో కాలాంగి శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఎస్సీ మహేందర్, టేకుల పల్లి ఎ.ఈదేవా, బొమ్మనపల్లి ఏఈ బుజ్జి కన్నయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కోరం సురేందర్, కొవ్వొత్తుల శ్రీనివాస్ రావు జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు మండల రజిని, మేకల మల్లిబాబు యాదవ్, ఇది గణేష్, మాజీ సర్పంచ్ రెడ్డియ్యా నాయక్, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతుకు వెన్ను దన్నుగా వ్యవ "సాయం"

*అశ్వారావు పేట,డిసెంబర్02, ప్రజాజ్యోతి:*



అన్నదాతల ప్రగతిలోనే దేశాభివృద్ధి దాగి ఉందనేది కాదనలేని సత్యం. రైతులు ఆర్థికాభివృద్ధికి దన్నుగా నిలవడం కోసం తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని రైతు సంఘం నాయకులు ఆలపాటి రామచంద్ర ప్రసాద్, బండి భాస్కర్, మొగళ్ళపు చెన్నకేశవ రావు అన్నారు. సోమవారం పత్రికలకు విడుదల చేసిన ప్రకటన వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు ప్రభుత్వం నడుస్తుందని రైతుల కష్టం కేవలం వారి కోసం మాత్రమే కాదని, లోకానికి అన్నం పెట్టేందుకాని, అటువంటి గొప్ప మనసు రైతన్నలదన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతుల అభివృద్ధికి కృషి చేస్తున్నారని, వ్యవసాయానికి విజ్ఞానం చేరువ చేసేందుకు ఎన్నో విప్లవాత్మక కార్యక్రమాలు రూపొందిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రి తుమ్మల వ్యవసాయానికి ఎంతో ఉన్నతమైన స్థానం ఇచ్చారని, ఆయన దృష్టిలో వ్యవసాయం అంటే సిరులు మాత్రమే కాదని, సంస్కృతి, సంప్రదాయం కూడా అన్నారు. అన్నదాతలకు సకాలంలో చేయూతను అందించగలిగితే, మన ఆహార అవసరాలను తీర్చుకోవడమే కాదు, ఎంతోమంది ఆకలి తీర్చేందుకు మరో నాలుగు అడుగులు ముందుకు వస్తారన్న ఆలోచన తుమ్మలదన్నారు. రైతులకు మంచి ధరను అందించడంతో పాటు, వారికి సకాలంలో సరసమైన విధంగా రుణాలు అందేలా చూడడంలో మంత్రి తుమ్మల విజయం సాధించారన్నారు. వ్యవసాయం అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వాలతో పాటు ప్రజల మనసుల్లో వ్యవసాయ రంగాన్ని చూసే దృష్టికోణం మారాలని, విజ్ఞానంతో వ్యవసాయ రంగ అభివృద్ధిలో యువతను భాగస్వాములను చేసేందుకు మంత్రి తుమ్మల కృషి చేస్తున్నరన్నారు. ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా రైతులు ప్రభుత్వ సమన్వయంతో పని చేయడం ద్వారా రైతుల ఆర్థిక స్థితిని మెరుగుపరచడం సాధ్యమౌతుందని, ఫలితంగా యువతరాన్ని సైతం వ్యవసాయ రంగం దిశగా అడుగులు వేయటం సాధ్యమవుతుందన్నారు.

### "వరి "నుంచి "పామాయిల్" వరకు అన్నింటి అభివృద్ధి

కాంగ్రెస్ ప్రభుత్వంలో తుమ్మల వ్యవసాయ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత "వరి "నుంచి "పామాయిల్" వరకు మద్దతు ధర విషయంలో రైతులకు వెన్ను దన్నుగా నిలవడంలో విజయం సాధించారటంలో సందేహం లేదు. వరికి రూ.500 బోనస్ ఇవ్వటంతో రైతులు ఏంతో అనందంగా ఉన్నారని రైతు సంఘం నాయకులు అన్నారు. అన్నదాతలకు రూ.500 బోనస్ ఇవ్వటంతో రైతులు సన్నధాన్యాన్ని పండించేందుకు ఆసక్తి చూపిస్తున్నారన్నారు. పామాయిల్ సైతం మద్దతు ధర విషయంలో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని, నేడు పామాయిల్ ధర రూ.20వేలు దాటిందన్నారు. రైతులను ఆర్థికంగా నిలబడేందుకు అన్ని విధాలుగా ప్రభుత్వ సహకారంతో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అనుక్షణం తపన పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు

## బ్యాంబో క్లస్టర్ ను పరిశీలించిన ఇండస్ట్రీ ఫౌండేషన్ బృందం

*చంద్రుగొండ,డిసెంబర్ 2( ప్రజా జ్యోతి ):*



చంద్రుగొండ మండలం బెండలపాడులోని బాంబుక్లస్టర్నుమహారాష్ట్ర పూణే ఇండస్ట్రీ ఫౌండేషన్ డాక్టర్ శ్రీకాంత్ వాసుదేవ్ సీనియర్ సైంటిస్ట్ బృందం సోమవారం సందర్శించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఇటీవల బ్యాంబో క్లస్టర్ ద్వారా వచ్చే వెదురు ఉత్పత్తులను రాష్ట్రం నలుమూలల వెళ్లే విధంగా తీసుకుంటున్న చర్యలలో భాగంగా పలువురు సందర్శిస్తూ వాటి గురించి తెలుసుకుంటున్నారు. ఎంపీడీవో అశోక్, కలెక్టర్ కార్యాలయ సిసి గణేష్, భద్రాద్రి జిల్లా దిశా కమిటీ సభ్యుడు బొర్రా సురేష్, చైర్మన్ వీసం నాగభూషణం తదితరులు వెదురు ఉత్పత్తి గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మల్లం కృష్ణయ్య, కారం అన్వేష్, భద్రయ్య, పంచాయతీ సెక్రటరీ రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి



**ఇల్లందు, డిసెంబర్ 2, ప్రజాజ్యోతి:**

ఇల్లందు మాజీ ఎమ్మెల్యే ఊకే అబ్బయ్య గత కొన్ని రోజుల క్రితం మృతి చెందడంతో సోమవారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఆధర్యపడవద్దని అండగా మేమున్నామని భరోసా ఇచ్చారు. ఇలాంటి అవసరం వచ్చినా తాను ఉన్నానని మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, కాంగ్రెస్ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అమాయక దళితులపై మావోయిస్టులు జరుపుతున్న హత్య కాండను నిరసిస్తూ SC సంఘాల ధర్నా



**కొత్తగూడెం, బస్టాండ్ సెంటర్, డిసెంబర్ 02 (ప్రజాజ్యోతి)**

అమాయక దళితులపై మావోయిస్టులు ఇన్ ఫార్మర్ నేపములతో జరుపుతున్నటువంటి దాడుల్లో ఉయికా రమేష్, అర్జున్, మరియు యేసు ఇల్లందు లో చంపడం జరిగింది. దీనిపై దళిత సంఘాలు ధర్నా చేస్తూ మావోయిస్టుల పై పోలీసు లు దాడులు చేసినప్పుడు మానవ హక్కుల చట్టం ఏ విధంగా అయితే విచారణ జరిపి చర్యలు తీసుకుంటారో అదే విధం గా మావోయిస్టులపై కూడా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని మనవహక్కులు సంఘాన్ని ప్రశ్నించడం జరిగింది. మావోయిస్టులు గన్స్ , బుల్లెట్ల పోరటలతో పేద, సామాన్య ప్రజలకు ఎలాంటి న్యాయం జరుగలేదు. మావోయిస్టు సిద్ధాంతాల ద్వారా ఏ విద్యాసంస్థ గాని ఏ వైద్యశాల గాని ఏ ఊరు గాని బాగుపడిన చరిత్ర లేదు కాబట్టి ఇలాంటి దారుణాలు మరల జరగకుండా మానవత దృక్పథంతో మనుషులను మనిషిగా గుర్తించాలని మరియు దళితుల పై ఇలాంటి మరణ కాండను జరగకుండా ప్రభుత్వం, మానవ హక్కుల సంగం చర్యలు తీసుకోవాలని బీజేపీ SC మోర్చా అధ్యక్షుడు గుంపుల మహేష్, భజరంగ్ దళ్ అధ్యక్షుడు చింటేశ్వర్, మరియు ఎం కిరణ్ పాల్గన్నారు.

## సిహెచ్పి ఇంచార్జ్ ను సన్మానించిన ఉద్యోగులు



**ఇల్లందు, డిసెంబర్ 2, ప్రజాజ్యోతి:**

సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియా సిహెచ్పి విభాగంలో సోమవారం గుర్తింపు సంఘం ఆధ్వర్యంలో ఇటీవల పదోన్నతి పొందిన డిజియం (ఇఅండ్యం) క్రిస్టఫర్ ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి నజీర్ అహ్మద్ మాట్లాడుతూ క్రిస్టఫర్ చాలా మృదుస్వభావి అని, ఉద్యోగులతో కలుపుకోలుగా ఉంటూ సంస్థ నిర్దేశించిన బొగ్గు రవాణాను ఎలాంటి ఆటంకం లేకుండా రక్షణతో పనిచేసి అందరి మన్ననలు పొందుతున్నారని పేర్కొన్నారు. అదే విధంగా క్రిస్టఫర్ భవిష్యత్తులో ఇదే పనితీరు కనబరిచి తోటి అధికారులు, ఉద్యోగుల మన్నలను పొంది మరిన్ని పదోన్నతులు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి పిట్ కార్యదర్శి నూనె శ్రీను, సహాయ కార్యదర్శి యాకుబ్, నాయకులు మనీ రవీంద్ర, వీరస్వామి, దాట్ల శ్రీకాంత్, మొసిన్, ముఖేష్, కిషోర్, సమ్మయ్య, శ్వేత, రైల్వే కాంట్రాక్ట్ కార్మికులు కొండపల్లి శ్రీనివాస్, యాకూబ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన జియంను కలిసిన నేతలు



**ఇల్లందు, డిసెంబర్ 2, ప్రజాజ్యోతి:**

సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియా నూతన జియంగా పదవి బాధ్యతలు స్వీకరించిన వీసం కృష్ణయ్యను సోమవారం బిఆర్ఎస్, టిబిజికెఎస్ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పుష్ప గుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. సింగరేణికి పుట్టినిల్లయిన ఇల్లందు ఏరియా మనుగడ కోసం త్వరితగతిన జెకె 5 ఓసి పొడగింపు ప్రాజెక్ట్ పనులు ప్రారంభించేందుకు చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్, టిబిజికెఎస్ సెంట్రల్ కమిటీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎస్. రంగనాథ్, టిబిజికెఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు జాఫర్ హుస్సేన్, వార్డు కౌన్సిలర్ జెకె శ్రీనివాస్, నాయకులు సిలివేరు సత్యనారాయణ, జబ్బార్, అబ్దుల్ నభి, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.



## బకాయి వేతనాలకై ఎమ్మెల్యే కు వినతిపత్రం



**దమ్మపేట, డిసెంబర్2(ప్రజాజ్యోతి):**

చాలీచాలని వేతనాలతో కాలం వెళ్ళదీస్తున్న పంచాయితీ కార్మికులు సోమవారం అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారే ఆదినారాయణను ఆయన స్వగృహంలో కలసి తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ క్రమంలో తమకు రావలసిన బకాయి వేతనాలు అందించి తమ కుటుంబాలను ఆదుకోవాలని కార్మికులు ఎమ్మెల్యే ను అభ్యర్థించారు. కార్మికుల సమస్యలపై స్పందించిన జారే ,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పంచాయితీ రాజ్ శాఖ మంత్రి సీతక్క ల దృష్టికి తీసుకువెళ్ళి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పంచాయితీ కార్మికులు ఎదుర్కోంటున్న ఇబ్బందులపై రాబోయే అసెంబ్లీ సమావేశాలలో ప్రస్తావిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమం లో మండల పరిధిలోని పంచాయితీ కార్మికులు ,కార్మిక సంఘాల నాయకులు తధితరులు పాల్గొన్నారు

## హిందూ స్మశాన వాటికలో పారిశుద్ధ్య పనులు

**ఇల్లందు, డిసెంబర్ 2, ప్రజాజ్యోతి:**



ప్రజా పాలన విజయోత్సవాల ను పురస్కరించు కొని సోమవారం రెండవ రోజు మున్సిపాలిటీ పరిధిలోని హిందూ స్మశాన వాటికలో మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో పారిశుద్ధ పనులను చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో ప్రజారంజక పాలన కొనసాగించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్రీకాంత్, మేనేజర్ అంకు షావలి, సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రిని కలిసిన కాంగ్రెస్ నేత

**ఇల్లందు, డిసెంబర్ 2, ప్రజాజ్యోతి:**



ఇల్లందు నియోజకవర్గంలోనే టేకులపల్లి మండలంలో జరిగే అభివృద్ధి పనులకు సోమవారం ఇల్లందు వచ్చిన రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కాంగ్రెస్ నాయకుడు కాకటి భార్గవ్ కలిశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలన ఏడాది పూర్తవుతున్నందున ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించినట్లు భార్గవ్ తెలిపారు.

## నిద్య మెడికల్ అకాడమీ ఆధ్వర్యంలో మెటీరియల్ పంపిణీ

**ఇల్లందు, డిసెంబర్ 2, ప్రజాజ్యోతి:**

హైదరాబాదులోని నిద్య మెడికల్ అకాడమీ ఆధ్వర్యంలో నర్సింగ్ కు సంబంధించిన అన్ని కోర్సుల మెటీరియల్ ను సోమవారం ఆ అకాడమీ చైర్మన్ ఎన్ జి నాయక్ సూచనల మేరకు మేనేజర్ గాంధీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ గాంధీ మాట్లాడుతూ తమ మెడికల్ అకాడమీలో నర్సింగ్ కు సంబంధించిన అన్ని కోర్సులకు తక్కువ ఫీజులతో కోచింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో మొట్టమొదటి నర్సింగ్ కోర్సులకు కోచింగ్ ఇస్తున్న ఏకైక సంస్థ నిద్య మెడికల్ అకాడమీ అని పేర్కొన్నారు. రాష్ట్రంలో నర్సింగ్ విభాగంలో మొదటి ర్యాంకు సాధించి తెలుగు రాష్ట్రాల్లో తమ మెడికల్ అకాడమీ సత్తా చాటుతూ అగ్రగామిగా నిలిచిందన్నారు. వరంగల్ లో 250, ఇల్లందులో 230, ఖమ్మంలో 300 మందికి ఉచిత మెటీరియల్ పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ రేవతి, సభ్యులు శాలిని, గణేష్, అఖిల్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ





**దమ్మ పేట, డిసెంబర్ 2(ప్రజాజ్యోతి)**

మండల పరిధిలోని జగ్గారం పంచాయితీ లో అనారోగ్యం తో మృతి చెందిన తాటి వెంకప్ప,కారం ఆదెమ్మల కుటుంబాలను అశ్వారావు పేట నియోజకవర్గ శాసనసభ్యులు జారే ఆదినారాయణ సోమవారం పరామర్శించారు.ఈ క్రమంలో వారి మృతికి గల కారణాలను ఆరాతీసిన ఎమ్మెల్యే, వారి కుటుంబాలకు ప్రత్యేక సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మడకం రాజేష్, స్థానిక నాయకులు తధితరులు పాల్గొన్నారు.

## పదవి విరమణ పొందిన బాలు నాయక్ ను సత్కరించిన - మాజీ సర్పంచ్ అజ్మీరా జగదీష్



**పాల్వంచ(రూరల్), డిసెంబర్02, (ప్రజాజ్యోతి ):**

బాలు నాయక్ (న్ఎండిసి )ఎంప్లాయీ నిన్నతన పదవి విరమణ చేయడం జరిగింది,పదవి విరమణ పొందిన బాలు నాయక్ వారి స్వగృహం శేఖరం బంజారి నందు కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువతో సత్కారించడం జరిగింది,ఈ కార్యక్రమం లో పాండురంగాపురంతండా మాజీ సర్పంచ్ అజ్మీరా జగదీశ్ కుమార్ మరియు రవినాయక్,కోటినాయక్,ప్రేమ్ కుమార్,సురేష్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి జిఎంని కలిసిన బిఆర్ఎస్ నాయకులు



**టేకులపల్లి, డిసెంబర్ 02, ప్రజాజ్యోతి:**

ఇల్లందు సింగరేణి సంస్థల ఏరియా జీఎం గా కొత్తగా వచ్చిన వీసం కృష్ణయ్యను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ నాయకులు లక్కినేని సురేందర్రావు,టేకులపల్లి బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు వరప్రసాద్ గౌడ్,మాజీ సర్పంచ్ మాలోత్ సురేందర్ నాయక్ మాజీ సర్పంచ్ తొలెంమల్లయ్య వెంకటేశ్వరరావు,బిఆర్ఎస్ యూత్ నాయకులు బానోత్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఆశ్రమ పాఠశాల తనిఖీ చేసిన ఐటీడీఏ పీవో

**టేకులపల్లి, డిసెంబర్ 2, ప్రజాజ్యోతి:**



మండలంలోని కోయగూడెం ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాహుల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు .అన్ని తరగతులను, వసతి గృహాలను పరిశీలించారు, వంటగది, వంట పాత్రలను,స్టోర్ రూంను పరిశీలించారు. ప్రైమరీ పాఠశాల ప్రత్యేకంగా పరిశీలించి ఉద్దీపాకము పుస్తకాల గురించి కొన్ని ప్రశ్నలు అడిగారు విద్యార్థుల చే గణితము,ఇంగ్లీష్,బ్లాక్ బోర్డు పై రాపించడం, అడగడం జరిగింది.ఉత్తమ సమాధానాలు ఇచ్చిన విద్యార్థులను చిన్న (గణితం, ఆంగ్లం) బహుమతులు ( నోట్స్, పెన్స్) అందించారు. ఎస్ఎస్సి తరగతిని పరిశీలించి విద్యార్థులకు కొన్ని ప్రశ్నలను అడిగి తెలుసుకున్నారు, నైన్త్ క్లాస్ లో హిందీ చదివించి తెలుగులో అర్థాలు చెప్పమని అడిగారు. అన్ని విషయాలు అడిగి మంచి సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు ఏటిడిఓ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. అమార్ సింగ్ పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటితో కలిసి అధికార పర్యటనలో పాల్గొన్న కొత్వాల



**పాల్వంచ(రూరల్),డిసెంబర్ 02(ప్రజా జ్యోతి):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు అసెంబ్లీ నియోజకవర్గంలోని టేకులపల్లి మండలం పరిధిలో సోమవారం జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర రెవెన్యూ,గృహనిర్మాణం,సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేశారు,ఇల్లందు శాసన సభ్యులు కోరం కనకయ్య,జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్,ఐ.టి.డి.ఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ బి.రాహుల్ లతో పాటు రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు పాల్గొన్నారు,ఈ కార్యక్రమాల్లో పాల్వంచ మాజీ జడ్పీటీసీ సభ్యులు యర్రంశెట్టి ముత్తయ్య,కాంగ్రెస్ నాయకులు వై. వెంకటేశ్వర్లు,పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు ముత్తంగి అలంకరణ



**భద్రాచలం, డిసెంబర్ 2 (ప్రజాజ్యోతి):**

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో సోమవారం అంతరాలయంలోని మూలవరులకు హైదరాబాద్ కు చెందిన భక్తులు రూ.30లక్షలతో తయారు చేయించి సమర్పించిన ముత్యాలు పొదిగిన ప్రత్యేక గొడుగులను అర్చకులు స్వామి వారికి ధరింపచేశారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారిణి సుప్రభాతం పలికి ఆరాధన, అరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి బేడా మండపంలో నిత్యకల్యాణాన్ని జరిపారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతిఒక్కరికీ అందేలా చర్యలు


### –గిరిజన దర్బార్లో ఐటీడీఏ ఏపీవో డేవిడ్ రాజ్

**భద్రాచలం, డిసెంబర్ 2 (ప్రజాజ్యోతి):**



మారుమూల గిరిజన గ్రామాల నుంచి గిరిజన దర్బార్ లో అర్జీలు సమర్పించేందుకు వచ్చే గిరిజన కుటుంబాల్లో అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేలా ఐటీడీఏ చర్యలు తీసుకుంటుందని భద్రాచలం ఐటీడీఏ ఏపీవో డేవిడ్ రాజ్ అన్నారు. సోమవారం ఐటీడీఏలో గిరిజన దర్బార్ నిర్వహించి గిరిజన గ్రామాల నుంచి గిరిజనులు తీసుకువచ్చిన అర్జీలను ఏపీవో డేవిడ్ రాజ్ స్వీకరించి తన పరిధిలో సమస్యలను వెంటనే పరిష్కరించి మిగిలిన వాటిని అధికారులకు పంపి పరిష్కరించేలా చూడాలన్నారు. అదివాసీ గిరిజన గ్రామాల్లో నివసించే నిరుపేద గిరిజన కుటుంబాలకు జీవనోపాధి కల్పించడానికి ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించడమే ఐటీడీఏ లక్ష్యమన్నారు. ట్రైకార్ ద్వారా సబ్సిడీ రుణాలు, పోడు భూములు, వ్యక్తిగత సమస్యలు, స్వయం ఉపాధి పథకాల రుణాలు, పట్టాభూములకు రైతుబంధు, జీవనోపాధి పెంపొందించేందుకు ఆర్థికసాయం, దీర్ఘకాలిక రోగాలకు వైద్యం చేయించుకునేందుకు ఆర్థిక సాయం గురుకులం సీట్లు, పై చదువులకు ఆర్థికసాయం కోసం అర్జీలు వచ్చినట్లు తెలిపారు గిరిజనదర్బార్ లో వచ్చిన అర్జీలు ఆన్లైన్ చేయించి ప్రత్యేక రిజిస్టర్ లో నమోదు చేసి ప్రతి గిరిజన కుటుంబానికి విడతల వారీగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ డిడి మణెమ్మ, ఆర్సీవో గురుకులం నాగార్జునరావు, ఎస్టీసీ రవీంద్రనాథ్, ఎస్వో భాస్కర్, ఏపీవో పవర్ ఏఈ మునీర్పాషా, ఎస్డీసీ ఉదయ కుమార్, డీటీఆర్ చోఎస్ఆర్ లక్ష్మీనారాయణ, కొండరెడ్ల విభాగం అధికారి మణిదర్, హెచ్ వో లింగానాయక్, ఐసీడీఎస్ సూపర్వైజర్ సౌమ్య, ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది మమత, భద్రమ్మ, స్వాతి, జోగారావు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు ముత్యాలహారం బహుకరణ



**భద్రాచలం, డిసెంబర్ 2 (ప్రజాజ్యోతి):**

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో స్వామివారికి హైదరాబాద్ సరూర్ నగర్ కు చెందిన ఓ భక్తుడు రూ.4లక్షల విలువైన ముత్యాలు పొదిగిన హారాన్నిబహుకరించారు.సోమవారం ఈముత్యాలు పొదిగిన హారాన్ని అర్చకులు, ఉద్యోగులకు అందజేశారు. అనంతరం దీపక్, కుటుంబసభ్యులు ఆలయంలో పూజలు నిర్వహించగా అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

# దొంగల పార్టీ కాదు ప్రజల పార్టీ కాంగ్రెస్: చీమలమర్రి

**దొంగే దొంగ దొంగ అన్నట్టు ఉంది.**

**ఊకదంపుడు ఉపన్యాసాలిస్తున్న బి.ఆర్.ఎస్ పార్టీ**



*చర్ల,డిసెంబర్2(ప్రజాజ్యోతి)*

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలంలోని కాంగ్రెస్ సీనియర్ నాయకులు చీమలమర్రి మురళి నివాసం వద్ద సోమవారం నాడు జరిగిన విలేకరుల సమావేశంలో పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వంపట్ల కాంగ్రెస్ నాయకులపట్ల టిఆర్ఎస్ నాయకులు మాట్లాడిన విధానాన్ని తప్పుపడుతూ, చర్ల మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు చీమలమర్రి మురళి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, గతంలో కాంగ్రెస్ పార్టీలో గెలిచిన పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ధనార్జనే ధ్యేయంగా పార్టీ మారిన తీరు ప్రజలందరికీ తెలుసు అన్నారు. ప్రస్తుత భద్రాచలం నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు ని విమర్శించే హక్కు రేగా కాంతారావు ఎక్కడిదని ఆయన ప్రశ్నించారు. దొంగే దొంగ దొంగ అన్నట్టు రేగా కాంతారావు వ్యవహార శైలి కొనసాగుతోందని ఆయన అన్నారు. రేపు జనవరిలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో టిఆర్ఎస్ పార్టీదే విజయం అంటూ 100% మాకే ప్రజలు పట్టం కడతారంటూ జోష్యం చెప్పిన రేగా కాంతారావు కు అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన పరాభవం ఎందుకు గుర్తుకు రావట్లేదో అర్థం కావట్లేదు అన్నారు.ఇక రాబోయే కాలంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఊహల్లోనే బతకాల్సి వస్తుందేమోనని అన్నారు..

## ఊక దంపుడు ఉపన్యాసాల నాయకుడు తాత మధు : పోలిన లంక రాజు



కాంగ్రెస్ పార్టీని విమర్శించే స్థాయి తాతామదుకు లేదని, అసెంబ్లీ ఎన్నికలు జరిగిన నాటి నుండి నేటి వరకు భద్రాచలం డివిజన్ లోనే కనపడని నాయకుడు తాతా మదు అని, ఇప్పుడేదో మండల స్థాయి సమావేశం అనగానే సమావేశంలో ఊక దంపుడు ఉపన్యాసాలు ఇచ్చి, కార్యకర్తలు చప్పట్లు కొట్టగానే ఊహల్లో తేలిపోతూ ఇక గెలుపు మనదే అన్నట్టుగా ఊహల్లో విహరించే వ్యక్తి తాత మధు అని, కాంగ్రెస్ పార్టీ మరో నాయకుడు పోలిన లంక రాజు అన్నారు. కనీసం ఈ సంవత్సరంలో ఆగస్టు నెలలో వచ్చిన వరదలకు చర్ల వైపు తిరిగి చూడని నాయకుడు రే గా కాంతారావు అని, ఆయనకు కాంగ్రెస్ పార్టీని కాంగ్రెస్ ఎమ్మెల్యేలను, కాంగ్రెస్ నాయకులను విమర్శించే హక్కు ఎంత మాత్రం లేదని, బిఆర్ఎస్ పార్టీ పదేళ్ల పాలనలో అమలు చేయలేని అభివృద్ధి పనులను, ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ చాకచక్యంతో పనులు పూర్తి చేస్తూ, పాలనలోకి వచ్చిన సంవత్సరంలోనే ప్రజల మన్ననలు చూరగొంటూ, అభివృద్ధి పథంలో నడిపిస్తున్న పార్టీని చూసి ఓర్వలేక బిఆర్ఎస్ పార్టీ నాయకులు మతి తప్పి మతి లేకుండా మాట్లాడుతున్నారని ఆయన అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల నాయకులు, ఇర్పా వసంత్ తాటి రామకృష్ణ, ఈశ్వర్, నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## తుమ్మల కృషితోనే ఆయిల్ ఫామ్ రైతులకు సిరులు...ఆలపాటి



*దమ్మపేట,డిసెంబర్2(ప్రజాజ్యోతి)*

తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషితోనే పామాయిల్ రైతుల ఇంట సిరులు పండుతున్నాయని ఆయిల్ ఫామ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆలపాటి ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. సొసైటీ చైర్మన్ ఎల్లిన రాఘవరావు నివాసంలో జరిగిన ఆయిల్ ఫామ్ రైతుల సమావేశం లో ఆలపాటి మాట్లాడుతూ ప్రతినెల పైపైకి వెళుతూ, రైతులకు లాభాలపంట పండిస్తున్నదని, పామాయిల్ రైతుల సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువెళడంతో ,చమురు దిగుమతులపై సుంకాన్ని పెంచడం తో ఆయిల్ ఫామ్ ధర 20000లను చేరిందని ఈ సందర్భంగా ఆయన అన్నారు.ఆయిల్ ఫామ్ దర పెరుగుదలతో పాటు,రెండు లక్షల రుణమాఫీ,వరి రైతులకు 500రుపాయల బోనస్ లు వంటి పథకాలతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని మరో సారి ఋజువైందని ఆలపాటి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు కొయ్యల అచ్యుతరావు, కేవీ సత్యనారాయణ, కాసాని నాగప్రసాద్,ఎర్రా వసంతరావు,మన్నెం అప్పారావు,గూడపాటి వెంకట్రావు తధితరులు పాల్గొన్నారు.


## అనారోగ్యంతో వ్యక్తి మృతి



*టేకులపల్లి, డిసెంబర్02, ప్రజాజ్యోతి:*

టేకులపల్లి మండలంలోని లచ్చతండా గ్రామం నందు భూక్య సాంక్రియా అనే వ్యక్తి చనిపోయిన విషయం తెలుసుకొని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కోరం సురేందర్ పార్థివ దేహానికి పూలమాల సమర్పించి, నివాళులు అర్పించారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఇది గణేష్, మోకాళ్ళ పోషాలు, సర్దార్, సుదీప్, శేఖర్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్తు సరఫరా లో అంతరాయం



*ములకలపల్లి ,డిసెంబర్ 02, ప్రజాజ్యోతి:*

విద్యుత్తు లైన్ ల మరమ్మత్తులు కారణంగా మంగళవారం ములకలపల్లి, పొగళ్లపల్లి వెళ్లే ఫిడర్ల పరిధిలోని గ్రామాలలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ములకలపల్లి విద్యుత్తు శాఖ ఏ ఈ బి నరేష్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

## పౌష్టికాహారం పట్ల తగిన జాగ్రత్త పాటించాలి

**కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మంగీలాల్**



*జూలూరుపాడు, డిసెంబర్2(ప్రజాజ్యోతి)*

జూలూరుపాడు మండలంలోని పాపకొల్లు మరియు బోజ్యా తండా గ్రామపంచాయతీ నందు పలు పాఠశాలలను మండల కాంగ్రెస్ అధ్యక్షులు మాలోత్ మంగీలాల్ నాయక్ సందర్శించారు. పిల్లల కు ఇచ్చే ఆహారంలో పరిశుభ్రతను పాటించాలని వండే సమయం నుంచి వడ్డించే వరకు తగిన జాగ్రత్తలతో వ్యవహరించాలని నాసిరకం కూరగాయలు వాడవద్దని వంట తయారీదారులకు సూచించారు. భోజనం వండిన తర్వాత భోజనం రుచి తెలుసుకుని పిల్లలకు వడ్డించాల్సిందిగా కోరారు. అదే విధంగా గ్రామస్తుల సూచన మేరకు బోజ్యా తండాలో శిథిలావస్థలో ఉన్న అంగన్వాడి సెంటర్ను పరిశీలించి బిల్డింగ్ నిర్మాణం కోసం ఎమ్మెల్యే రాందాస్ నాయక్ దృష్టికి తీసుకోండి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిషన్ లాల్,మోతిలాల్, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## సింహ గర్జన బహిరంగ సభ సక్సెస్ వేడుకలు



*భద్రాచలం టౌన్, డిసెంబర్ 1(ప్రజాజ్యోతి)*

హైదరాబాద్ పెరేడ్ గ్రౌండ్స్ లో డిసెంబర్ 1న జరిగిన మాలల సింహ గర్జన కి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లో ఉన్నటువంటి మాల ఉద్యోగస్తులు విద్యార్థులు లాయర్లు,మహిళలు, అన్ని జిల్లాల నుంచి అత్యధిక సంఖ్యలో తరలివచ్చి సింహ గర్జన మీటింగ్ ను గర్జించే విధంగా విజయవంతం చేసిన సందర్భంగా మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దాసరి శేఖర్, అల్లాడి పౌల్ రాజ్ భద్రాచలం మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్ లో టపాసులు కాల్చి జై భీమ్ జై మాల మాలల ఐక్యత వర్ధిల్లాలి అని రాజ్యాంగం వర్ధిల్లాలని నినాదాలు చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మాలలు అందరినీ చైతన్యవంతులుగా మార్చి ఇంత గొప్ప మీటింగ్ ను పెట్టిన డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ ప్రతి మండలంలో ప్రతి మాల కార్యకర్తలు ఎంతో కష్టపడటం జరిగిందని, ఇక జరగబోయే మాల ఉద్యమాలకు ప్రతి మాల కార్యకర్త సైనికులగా పనిచేయాలని, ఏబిసిడి వర్గీకరణ రద్దు చేసే అంతవరకు మాలలు అలుపెరగని పోరాటం చేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కనువింపు పోరాటం చేయాలి అని అన్నారు.వారి వెన్నంటే ఉంటూ వారికి అన్ని రకాలుగా సహాయపడుతూ మాలల సింహ గర్జన మీటింగును విజయవంతం చేసిన మాల సంఘాల రాష్ట్ర నాయకులకు కూడా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు పొలమూరి బసవరాజు, భద్రాచలం పట్టణ అధ్యక్షులు డేగల శివ, దళిత నాయకులు ఏవి రావు, పొలమురి శైలజ రాజ్, ప్రసాద్, ప్రేమ్ చంద్, మోత్కూరు సత్యం పాల్గొన్నారు..



# పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి ఐటీడీఏ ముందు ధర్నా

### జిల్లా కార్యదర్శి కారం పుల్లయ్య డిమాండ్

*భద్రాచలం టౌన్, డిసెంబర్ 1(ప్రజాజ్యోతి )*



సోమవారం భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం ముందు తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని ధర్నా చేశారు. అనంతరం ఐటీడీఏ ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం జిల్లా కార్యదర్శి కారం పుల్లయ్య మాట్లాడుతూ చర్ల మండలం కలివేరు గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న రజబ్ అలీ కాలనీ చెందిన ఆదివాసిలు గత 40 సంవత్సరాల నుండి పోడు వ్యవసాయం చేసుకుంటున్న వారికి ఆటవి హక్కుల గుర్తింపు చట్టం 2006 ప్రకారం హక్కు పత్రాలు 5బి కుటుంబాలకు ఇవ్వాలని ఆయన ఈ సందర్భంగా ఏపీవో తో మాట్లాడడం జరిగింది. అనంతరం ఏపీవో మాట్లాడుతూ ప్రభుత్వందృష్టికి తీసుకొని వెళ్తానని వారందరికీ పట్టాలు ఇచ్చే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా జిల్లా కార్యదర్శి పుల్లయ్య మాట్లాడుతూ రజబ్ అలీ కాలనీ ఆదివాసీలు గత సోమవారం ప్రజాదర్బార్లో గ్రామానికి మిషన్ భగీరథ పైప్ లైన్ ద్వారా మంచినీళ్లు అందించాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అయినప్పటికీ ఇప్పటివరకు పరిష్కారం కాలేదని, వెంటనే పరిష్కరించాలని కోరగా సంబంధిత అధికారులను పిలిచి వారితో మాట్లాడడం జరిగింది. ఆ సమస్యను వెంటనే పరిష్కరిస్తామని ఏపీవో హామీ ఇచ్చారు, అదేవిధంగా ఆళ్ళపల్లి మండలం పెద్ద వెంకటాపురం గ్రామానికి చెందిన వలస ఆదివాసీలకు పట్టాలు ఇవ్వాలని,48 కుటుంబాలు గత 30 సంవత్సరాల నుండి సాగు చేస్తున్నప్పటికీ ఇప్పటివరకు పట్టాలు రాలేదని అన్నారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శి కుంజా శ్రీను, పోడు సాగుదారులు, మడకం సీతయ్య, మడకం నాగేష్, యసం చిన్నబి, నూప మల్లయ్య , ఇరప ముత్తయ్య, కారం సింగమ్మ ,మడకం ఉంగమ్మ ,సున్నం సమ్మక్క, కనితి జోగయ్య ,మడకం వీరయ్య ,బీరప్పగుట్టయ్య , ఉయక గీత, ముక్కోటి సురేష్ ,మడి అనిల్ పాల్గొన్నారు

## నేడు చంద్రుగొండ మండలంలో ఎమ్మెల్యే జారే పర్యటన

*చంద్రుగొండ, డిసెంబర్ 2( ప్రజాజ్యోతి ):*



నేడు చంద్రుగొండ మండలంలో అశ్వరావుపేట శాసనసభ్యులు ఆదినారాయణ పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనన్నారని చంద్రుగొండ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దారం గోవింద్ రెడ్డి తెలిపారు. సీఎంఆర్ఎఫ్ కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ 50 మందికి గాను 35 లక్షల 32వేల తొమ్మిది వందల రూపాయలు పంపిణీ చేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని తెలిపారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే చెరసాలె

### అశ్వాపురం ఎస్సై ఎస్.కె రహూఫ్



*అశ్వాపురం, డిసెంబర్ 2, ప్రజా జ్యోతి*

అశ్వాపురం మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ సమీపంలో సోమవారం నాడు ఎస్సై ఎస్.కె రహూఫ్ ఆధ్వర్యంలో విస్తృత వాహన తనిఖీలు నిర్వహించారు ఈ నేపథ్యంలో వాహనదారులతో ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి దారుడు వాహనంతో పాటే వాహన ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. మద్యం తాగి వాహనం నడిపేవారు అమాయకుల ప్రాణాలను ప్రమాదంలో పడేస్తున్నారని తెలిపారు. తాగి వాహనం నడపడం వల్ల దేశంలో సంవత్సరానికి లక్ష 50వేల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, మద్యం మత్తులో ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడపకూడదని హెచ్చరించారు. పోలీసులు ఎప్పుడు పౌర సమాజానికి మంచి స్నేహితులని మంచి చేసిన వారికి అండగా ఉంటూ చెడు చేసిన వారికి కచ్చితంగా శిక్ష ఉంటుందన్నారు. 18 ఏళ్లు పైబడి డ్రైవింగ్ లైసెన్స్ ఉంటేనే వాహనాలు నడపాలని తెలిపారు. మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులకు శిక్షలు తప్పవు అని తెలిపారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక నిల్వలు సీజ్



*బూర్గంపహాడ్,డిసెంబర్ 02, (ప్రజా జ్యోతి ):*

అక్రమంగా నిల్వ చేసిన ఇసుక రాశులను రెవెన్యూ అధికారులు సోమవారం సీజ్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక ఎస్బిఐ బ్యాంకు పక్కన ఖాళీ స్థలంలో అక్రమంగా ఇసుకను నిల్వ చేసినట్లు సమాచారం అందుకున్న తహశీల్దార్ ముజాహిద్ తనిఖీలకు డిప్యూటీ తహశీల్దార్ రామ్ నరేష్, ఆర్.ఐ ముత్తయ్య లను ఆదేశించారు. ఖాళీ స్థలంలో నిల్వ ఉన్న ఇసుక రాశులను గుర్తించారు. వాటికి ఎటువంటి అనుమతులు లేకపోవటంతో పంచులు సమక్షంలో సీజ్ చేశారు. నివేదికను తహశీల్దార్ కు అందించారు. అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను గుర్తించి స్వాధీనం చేసుకున్నామని, ఉన్నతాధికారుల సూచనల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పై సమగ్ర విచారణ జరపాలి

### సర్వేలో ఇంటి నెంబరు తొలగించాలి

### ఐటీడీఏ పీవో ఆధ్వర్యంలో ఆర్డిఓ విచారణ జరపాలి




*చర్ల, డిసెంబర్ 2 (ప్రజా జ్యోతి )*

చర్ల మండలంలో లక్ష్మీ కాలనీలో ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పై సమగ్ర విచారణ చేయాలని సిపిఎం మండల కార్యదర్శి మచ్చ రామారావు అన్నారు. కామ్రేడ్ బిఎస్ రామయ్య భవన్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజల కొరకు ఇచ్చిన ఇళ్లను కొంతమంది ప్రతినిధులు దళారులు అమ్ముకోవడం సరైన విధానం కాదని దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని ఇండ్లకు అమ్మకానికి అనుమతి ఎవరిచ్చారని? కరెంటు మీటర్లు ఎలా వచ్చాయని? అమ్మకాలు జరిపిన వ్యక్తులపై కఠినంగా శిక్షించాలని ప్రభుత్వ ఆస్తులను సొంత ఆస్తుల్లా అమ్ముకోవడం దురదృష్టకరమని ఇందులో గతంలో ప్రజా ప్రతినిధుల హస్తం ఉన్నదని దీనిపై సమగ్ర విచారణ చేయాలని తెలంగాణ సర్వే లో వారి యొక్క వివరాలు నమోదు చేయకుండా నిలిపివేయాలని దీనికి పూర్తిస్థాయిలో అధికారులు సహకరించాలని గతంలో కూడా సిపిఎం పార్టీగా మండల తాసిల్దార్ కి వినతి పత్రం అందజేసినామని కానీ స్పందించే పరిస్థితి లేదని కావున ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి అమ్మకం చేసిన వ్యక్తులపై కేసులు నమోదు చేసి పూర్తిస్థాయిలో విచారణ చేసి అసలైన పేదలకు ఇండ్లను పంపిణీ చేయాలని అన్నారు దీనికి ప్రత్యేకంగా భద్రాచలం ఐటిడిఏ పిఓ మరియు ఆర్డిఓ ఆధ్వర్యంలో డబల్ బెడ్ రూమ్ విషయంలో జోక్యం చేసుకొని విచారణ చేయాలని లేని పక్షంలో భవిష్యత్తులో పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కారం నరేష్ బందెల చంటి అమర్ బాలాజీ పొడుపు గంటి సమ్మక్క దొడ్డి హరి నాగ వర్మ బి నవీన్ షారోన్ వరదల వరలక్ష్మి పాల్గొన్నారు.

## స్కాలర్స్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ లో చోటు దక్కించుకున్న బ్రిలియంట్ విద్యాసంస్థ




*బూర్గంపహాడ్,డిసెంబర్ 02 (ప్రజా జ్యోతి ):*

వరల్డ్ ఎన్విరాన్మెంటల్ ఆర్గనైజేషన్ వారు దేశ వ్యాప్తంగా ఎన్విరాన్మెంటల్ పై నిర్వహించిన సర్వేలో దేశవ్యాప్తంగా వెయ్యిమంది విద్యార్థులను పలు సంస్థలను ఎంపిక చేయడం జరిగింది. అందులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుండి స్కాలర్స్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో బ్రిలియంట్ విద్యాసంస్థ మరియు విద్యార్థులు ఎంపికయ్యారు. డాక్టర్ అమృత రావు ఎడ్యుకేషన్ సొసైటీ మరియు మెంటరాక్స్ ఎవర్ గ్రీన్ ఒలివ్స్ వారు సంయుక్త ఆధ్వర్యంలో హైద్రాబాద్ డాక్టర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆడిటోరియంలో ఆదివారం వరల్డ్ ఆర్గనైజేషన్ వారి నిర్వహించిన వరల్డ్ ఎన్విరాన్మెంటల్ అవగాహన సదస్సులో భాగంగా అట్టి విద్యార్థులకు హోవర్ టెక్ ఫౌండర్, సి ఈ ఓ డాక్టర్ మునీష్ జిందాల్ చేతుల మీదుగా బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ బిఎన్ఆర్ మరియు విద్యార్థులు టి. రాజ్ దీప్ రెడ్డి, ఎం.చరణ్ తేజ, జి.శాలిని,జి.జ్యోతిర్మయి, ఓ.శ్రావ్యశ్రీ లు ఈ అవార్డులను అందుకున్నారు. ఇలాంటి అవార్డులు పిల్లలో సమాజం పట్ల పర్యావరణం పట్ల స్థూల దృక్పథంను కలిగి ఉంటారని ,వారిలో మనో సామర్థ్యాలను పెంపొందించే విధంగా ఉపయోగపడతాయని తెలియజేశారు. ఈ అవార్డులను అందుకున్న విద్యార్థులకు తోటి విద్యార్థులు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు శుభాకాంక్షలు తెలిపారు.

## మహిళల పై జరుగుతున్న హింసను అరికట్టాలి

### –పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత కల్పించాలి

*కొత్తగూడెం కలెక్టరేట్, డిసెంబర్ 02 (ప్రజాజ్యోతి ):*




భారతదేశంలో మహిళలు, పిల్లలపై పెరుగుతున్న హింసను అరికట్టాలని, మహిళలకు పని ప్రదేశాల్లో భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎజె రమేష్ మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలని, మహిళలకు పని ప్రదేశాల్లో భద్రాత కల్పించాలని డిమాండ్ చేసారు. కలకత్తా నగరంలో ప్రభుత్వ వైద్య కళాశాలలో ట్రైనీ డాక్టర్ పై ఇటీవల జరిగిన దారుణమైన హత్యాచారం, మహారాష్ట్రలోని బాడ్లాపూర్ఆనేలో 4 ఏళ్ల చిన్నారులపై హత్యాచారం, పలు రాష్ట్రాల్లో మహిళలపై జరిగిన సంఘటనలకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసారు. దేశంలో మహిళల పై జరుగుతున్న హత్యాచారాల ఘటనల పై ప్రధాని మోడీ నోరు మెదపకపోవడం దారుణమని విమర్శించారు. మహిళలు చేస్తున్న ఉద్యోగ ప్రదేశాల్లో ప్రత్యేకంగా అన్నిరకాల వసతులు కల్పించాలని, జెస్టిస్ వర్మా సిఫారసును అమలు చేయాలని, పారామెడికల్ సిబ్బంది, ఆశా వర్కర్లు, ఎసిలీటర్లతో సహా ఆరోగ్య సిబ్బంది పద్దతులను నిర్ధారించడానికి ప్రత్యేక చట్టం చేయాలని, మహిళల పై సైబర్ నేరాలకు వ్యతిరేకంగా ప్రత్యేక చట్టం తీసుకురావాలని ఆయన డిమాండ్ చేసారు. శ్రామిక మహిళ జి. పద్మా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు ఉపాధ్యక్షులు దొడ్డా రవి కుమార్, పిట్టల అర్జున్, భూక్యా రమేష్, వెంకటమ్మ, నజ్మ, అనసూయ, రమణ, స్వరూప, నిరోషా, అలివేలు, ఫాతిమ, జ్యోతి యశోద తదితరులు పాల్గొన్నారు.

# పేదవారికి సాయం చేద్దాం

ప్రజా విజయోత్సవాల్లో భాగంగా దుప్పట్లు పంపిణీ చేసిన తుమ్మల అనుచరుడు అడపా నాగేశ్వరరావు





**ములకలపల్లి ,డిసెంబర్ 02, (ప్రజాజ్యోతి ):**

ప్రజావిజయోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని ముత్యాలంపాడు గ్రామంలో సోమవారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు తుమ్మల అనుచరుడు,రైతు అడపా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 126 మంది వృద్ధులకు ,పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ కాంగ్రెస్ నాయకులు కారం సుదీర్ చేతుల మీదుగా ఈ దుప్పట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సుదీర్ మాట్లాడుతూ తన జన్మదినానికి వృధాగా ఖర్చులు పెట్టకుండా ఆ డబ్బులతో పేద వారికి సాయం చేయాలన్న మంత్రి తుమ్మల ఆదేశాల మేరకు మండలంలోని నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న అడపా సేవా స్ఫూర్తిని ఆయన కొనియాడారు. అడపా స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పేదలకు సాయం చేయాలని కోరారు. అనంతరం అడపా నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి అని ఎన్నికల హామీల మేరకు నాలుగు విడతలుగా రైతులకు రుణమాఫీ చేసి, రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి తన వాగ్దానం నిలబెట్టుకుందన్నారు. రైతులకు బ్యాంకుల లో ఏళ్ళ తరబడి ఉన్న రుణాలు మాఫీ అవడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు రైతు బాగుంటేనే రాజ్యం సుభిక్షంగా వుంటుందనే కాంగ్రెస్ పార్టీ నినాదంతో రాష్ట్రంలో రైతుల శ్రేయస్సు కోసం రైతుల భరోసాకు రూ రెండు లక్షల రుణ మాఫీ, రైతులు పండించిన ధాన్యానికి క్వింటాకు రూ 500 బోనస్ వంటి ఎన్నో పథకాలతో రైతులను రాజులను చేస్తుందన్నారు. ఇటీవల జరిగిన మంత్రి తుమ్మల పుట్టిన రోజు తో పాటు, కాంగ్రెస్ ప్రభుత్వ పాలన 11 నెలలు పూర్తి చేసుకోని ప్రజా విజియోత్సవాలలో భాగంగా రైతు పండగ చేసుకున్న శుభ సందర్భంలో వృద్ధులకు, పేదలకు దుప్పట్లు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వాడే శేషగిరి, గ్రామస్తులు కుంజా రాంబాబు, కుంజా వెంకటేశ్వర్లు, తాటి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## తూము వెంకటేశ్వరరావు భౌతికఖాయానికి తుమ్మల నివాళులు

**భద్రాచలం టౌన్, డిసెంబర్ 2(ప్రజాజ్యోతి )**

భద్రాచలం పట్టణ శాంతినగర్ కాలనీ వాస్తవ్యులు ఆత్మీయబంధువు తూము వెంకటేశ్వరరావు అనారోగ్యంతో సోమవారం మృతి చెందగా సమాచారం అందిన వెంటనే రాష్ట్ర వ్యవసాయ,మార్కెటింగ్, సహకారశాఖామాత్యులు తుమ్మల నాగేశ్వరరావు హుటాహుటిన భద్రాచలానికి విచ్చేసి వారి భౌతికఖాయానికి నివాళులర్పించి వెంకటేశ్వరరావు కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మంత్రి తుమ్మల వెంట నియోజకవర్గ శాసనసభ్యులు తెల్లం వెంకటరావు,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరిమి. శ్రీనివాస రావు, స్థానిక ముఖ్యనాయకులు, పట్టణ ప్రముఖులు, మాజీ ప్రజాప్రతినిధులు వ్యాపారవేత్తలు,పార్టీ క్యాడర్ ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## కేసులను సత్వరంగా పరిష్కరించాలి

పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్





**ములకలపల్లి, డిసెంబర్ 02, ప్రజా జ్యోతి:**

పోలీస్ స్టేషన్ కు వచ్చిన కేసులను సత్వర పరిష్కరించాలని పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. సోమవారం సిఐ వినయ్ కుమార్ తో కలసి స్థానిక పోలీస్ స్టేషన్ లో తనిఖీ చేశారు. ముందుగా పరిసరాలను పరిశీలించి, స్టేషన్ లోని రికార్డులను తనిఖీ చేశా స్టేషన్ ఆవరణంలో మొక్కలను నాటారు. సిబ్బందితో ప్రత్యేకంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్ పరిసరాలను ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అర్జీదారుల పట్ల మర్యాదగా ప్రవరిస్తూ, ఫ్రెండ్లి పోలీసింగ్ చేయాలన్నారు. కేసులను పెండింగ్ లో లేకుండా సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## సాయి మందిరాన్ని సందర్శించిన ఐటీడీఏ పీ ఓ దంపతులు



**భద్రాచలం టౌన్, డిసెంబర్ 1(ప్రజాజ్యోతి )**

భద్రాచలం జూనియర్ కళాశాల సెంటర్లో ఉన్న శ్రీ సాయి బాబా వారి మందిరాన్ని భద్రాచలం ఐటిడిఏ పిఓ రాహుల్ సతి సమేతంగా విచ్చేశారు.పి ఓ ధర్మపతి పుట్టిన రోజు పురస్కరించుకొని సాయిబాబా వారి మందిరాన్ని సందర్శించినట్లు అధ్యక్షులు తుమ్మలపల్లి సత్యనారాయణమూర్తి తెలిపారు.అర్చన అనంతరం పి వో దంపతులకు శాలువాతో సత్కరించి బాబా వారి మెమెంటోను అందజేశారు ఈ కార్యక్రమంలో ఆలయ ఉపాధ్యక్షులు మాగంటి శ్రీనివాస్ వరప్రసాద్, కోశాధికారి కుంచాల రమేష్, ఆలయ సభ్యులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కార్మికులకు రూ.12వేలు జీవన భృతి అందజేయాలి

**కొత్తగూడెం కలెక్టరేట్, డిసెంబర్ 02 (ప్రజాజ్యోతి ):**

వ్యవసాయ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సంవత్సరానికి రూ.12వేలు జీవనభృతి వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మకసంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపూడి రాము, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి ముద్దా భిక్షంలు మాట్లాడుతూ.. వ్యవసాయ కార్మికుల పిల్లలకు ఉచిత విద్య, వైద్యం అందించాలని, డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణంలో కార్మికుల కుటుంబాలకు ప్రధమ ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తవుతున్నప్పటికీ వ్యవసాయ కార్మికుల పట్ల నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారెంటీలను అమలు చేయాలని, లేనిపక్షంలో తమ సంఘం ఆధ్వర్యంలో దశలవారి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరు వినతి పత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాయిని రాజు, నూకా భాస్కర్, పి లక్ష్మణ్, నిమ్మల రాంబాబు, కల్లూరి కిషోర్, వెంకన్న, గోపాలరావు, ధర్మా, సతీష్, వెంకటేష్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

జిల్లా ప్రధాన కార్యదర్శి: పోగుల



**జూలూరుపాడు, డిసెంబర్ 2, (ప్రజా జ్యోతి )**

డిసెంబర్ 4, 5తేదీల్లో పాల్వంచలో జరిగే రాష్ట్ర సైద్ధాంతిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోగుల కోటేశ్వరరావు సోమవారం జూలూరుపాడు లో కరపత్రం ఆవిష్కరించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా 2009 నుంచి వెల్ఫేర్ బోర్డు ద్వారా 11 రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తుంది, ప్రస్తుతం ప్రమాద మరణం కు 6,30 లక్షలు, సహజ మరణం కు 1,30 లక్షలు వివాహ ప్రసూతి కానుక 30,000 చొప్పున తదితర సంక్షేమ పథకాలు బోర్డు ద్వారా ప్రభుత్వ అందిస్తుంది, ఢిల్లీ పంజాబ్ హర్యానా తమిళనాడు కర్ణాటక కేరళ వంటి ఇతర రాష్ట్రాల్లో భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ పిల్లలకు స్కాలర్షిప్లు సొంతగృహవసతి పథకాలు అమలు చేస్తున్న మన రాష్ట్ర ప్రభుత్వం నూతన సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం కానీ ఉన్న సంక్షేమ పథకాలు నిధులు పెంచడం కానీ రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని మను నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు ఈ నేపథ్యంలో పాల్వంచలో డిసెంబర్ 4, 5తేదీల్లో జరిగే రాష్ట్ర సైద్ధాంతిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు సిలివేరి నరసింహారావు, గుడిమెట్ల సీతయ్య, రామారావు వెంకటేశ్వర్లు, రాంబాబు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఖాళీ బిందెలతో మహిళల రాస్తారోకో



**చంద్రుగొండ, డిసెంబర్ 2( ప్రజా జ్యోతి ):**

చంద్రుగొండ మండలం వెంకటాపురం గ్రామంలో పదిరోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా కావడం లేదు దీంతో గ్రామస్తులు ఖాళీ బిందెలతో సోమవారం రాస్తారోకో నిర్వహించారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా అటు పంచాయతీ అధికారులు గాని సిబ్బంది గాని పట్టించుకోకపోవడంతో తాము రాస్తారోకో చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. తిప్పనపల్లి సుజాతనగర్ రోడ్డుపై అడ్డంగా ఖాళీ బిందెలు పెట్టి రాస్తారోకో నిర్వహించి మహిళలు మాట్లాడారు. గ్రామంలో 50 ఇళ్ల వరకు ఉన్నాయని నీళ్లు రాని సందర్భంలో కిలోమీటర్ దూరం నడిచి వెళ్లి నెత్తిన బిందెలతో మంచినీరు తెచ్చుకునే పరిస్థితిలో ఉన్నామని ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ సమస్యను తీర్చాలని కోరారు.